# కుడి ఎడమల దగా దగా!

అప్పుడెప్పుడో, ఎన్నాళ్ళకిందటో ఏమో, అప్పుడెప్పుడో, ఎన్నేళ్ళకిందటో ఏమో మనిషి, మృగం నించి వేరుపడాలని పోరాడి, ఆ పోరాటంలోంచి బయటపడి, వ్యవసాయం వేపు చూపు మళ్ళించినప్పుడే బ్రహ్మానందం పూర్వీకులు, ఆ మార్పుకు స్వాగతం పలికారు.

అనాది మానవుడు తన అవసరాలకోసం భూమిని దున్నినప్పుడు, విత్తనాలు నాటినప్పుడు పంటను కోసినప్పుడు బ్రహ్మానందం వంశంవారు, ఆనాటి కృషికులకు కావలసిన పరికరాలను తయారు చేసి ఇచ్చారు. మొన్న మొన్నటి దాకా ఆ వంశం వారు, ఆయా పనిముట్లను తయారు చేస్తూనే ఉన్నారు. రైతులకు సరఫరా చేస్తూనే ఉన్నారు.

విజ్ఞాన శాస్త్రం, అద్భుతంగా పెరిగిందిగదా! అవని నుండి అంతరిక్షంలోకి మానువుడు ఎగసిపోతున్నాడుగదా! పరమాణు గర్భాన్ని వచ్ఛిత్తి చేసి, పరమ శక్తి వంతమయిన శక్తిని ఆవిష్కరించాడు గదా! కోట్లాది కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న నభోమూర్తుల ఆనుపానుల్ని కూడా తెలుసుకుంటున్నాడు గదా! మరి ఈ ప్రభావం వ్యవసాయ రంగం మీద బాగా కనిపించదేం? మన రైతులింకా, అశోకుడి కాలం నాటి వ్యవసాయ పరికరాల్నే వాడుతున్నారేం?

గడచిన 20 ఏళ్ళుగా, ఏవో మార్పులొచ్చాయనుకోండి. ఈ మార్పులు రావడం మంచిదేగానీ, దీనివల్ల చాలా మంది వృత్తులు కోల్పోయారు. వారికి బతుకుతెరువు కనిపించలేదు. వారికి దిక్కూ మొక్కూ లేకుండా పోయింది. అలా పోయినవారిలో బ్రహ్మానందం ఒకడు.

బ్రహ్మానందం వంశం వారందరూ, వడ్రంగం పనిచేసేవారే! అందులోనూ, అప్పిశంగా, వ్యవసాయ పనులు మాత్రమే చేసేవారు.

"ఇంకోరి దగ్గరకెళ్ళి నేర్చుకోవలసిన అవసరం నాకేంలేదండీ! మా తాత ఈ పనిచేశాడు. మా నాన్నచేశాడు. నేనూ కొంతకాలం చేశాను." అని కాస్సేపు ఆగాడు బ్రహ్మానందం. పొరబోయిన చుట్టను, దవడలు పీక్కుపోయేలాగా రెండు గుంజులు గుంజి, కొస కొరికి దూరంగా వూస్తూ మళ్ళా వెలిగించాడు.

"పల్లెటూళ్ళు, ఇదివరకులాగా లేవండి! అంతా తెలివిమీరి పోయారు. నాకు పదిహేను అరకలుండేవి. అరక్కు పాతిక మానికల జొన్నలు కొలిచేవాళ్ళు. కందులు, పెసలు,శనగలు పండితే అద్దెడు, మూడు మానికలదాకా పెట్టేవాళ్ళు. నాకురెండు పాడి బర్రెలుండేవి. ఏ రైతు బీట్లోనో మేసి వస్తుండేవి. ఏ అయ్యవామిలోంచో ఓ మోపెడు చొప్ప కొట్టుకొచ్చుకొనేవాణ్ణి. ఏ జీతగాణ్ణి బతిమిలాడినా, రెండు గాబుల్నిండా బరీగా నీళ్ళు తోడి పోసేవాడు. ఇప్పుడా పద్ధతులన్నీ మారిపోయాయండి."

బ్రహ్మానందం, రోజుకు రెండు కొత్తనాగళ్ళు దుయ్యాచెక్కి అవతల పెడేసేవారు. గొర్రుగానీ, గుంటకగానీ చేస్తే, మరింక 'వంక' పెట్టడానికే ఉండేది కాదు. దంటె చేసినా, జడ్డిగం చేసినా, 'కరాకట్‌గా' ఉండేవి. ఏడికర్ర చెక్కినా, చీలునాగలు బిగించినా, మరింక ఎలువూ- నలువూ అన్న ప్రశ్నే ఉండేది కాదుట. ఈ పని కూడా ఆ రైతు పొలాన్ని బట్టి, అతడి ఎడ్ల పరిస్థితిని బట్టీ, తనే నిర్ణయం తీసుకునేవాడు.

“జగ్గిడం చేయడం, చాలా కష్టమండీ! మూడు కంతల్లోంచీ, విత్తనాలు సరిగా కిందికి జీరాలి. కన్నాల కొలతల్లో తేడాలున్నా, వంకర టింకరలున్నా, విత్తనాలన్నీ వొక చాలులోనే పడిపోతాయి. ఆ చాలులోనేమో పైరు చిత్తపత్తుగా పెరుగుతుంది. మిగిలిన చాళ్ళల్లో మొక్కలు ఈసుకుపోతాయి. నేను పదేళ్ళు చేశానుగదా! కావాలంటే మీరెళ్ళి అడగండి, బ్రహ్మానందం పనివాడితనం మీకే తెలుస్తుంది” అన్నాడతను.

వ్యవసాయం పనిముట్లు తయారీకి వడ్రంగం పనివస్తే చాలదు, కమ్మరం కూడా రావాలి. నాగలికర్రు సరవాలన్నా గుంటక పలుగులు సాగబట్టాలన్నా, ఏడికర్రను కట్లు బిగించాలన్నా, మొలలు తాపడం చేయాలన్నా కమ్మరం తప్పకుండా తెలిసి వుండాలి. బ్రహ్మానందానికి ఆ పని కూడా క్షుణ్ణంగా తెలుసు.

“ముక్కు మంచిది కావాలేగానీ బాబూ, నాగలికర్రు మూడేళ్ళ దాకా పదును పోకుండా పనిచేస్తుందండీ! గుంటకలపల్లు కూడా అంతే. నలిగితే గడ్డ నలగాలి. లేదా బెడ్డ విరిగి, పెళ్ళగించుకురావాలిగానీ, నేను చేసిన ‘పల్లు’ మాత్రం మొన విరగదండీ! ముక్క మెతక సరుకనుకోండి, నేను చేయగలిగిందేమీ లేదు. అందుకే, టౌనుకెళ్ళి నేను ముక్కలు తెస్తానండీ!” అన్నాడు బ్రహ్మానందం.

ఎండాకాలంలో బండి పనులు, ఇంటిపనులు చేసేవాడు బ్రహ్మానందం. డొలుపుచెక్కినా, ఇరుసు బిగించినా- వడీ, సడీ ఉండేది కాదన్నాడు. బండి కుండ మీద, తన పనివాడి తనమంతా చూపించేవాడినన్నాడు. కుండకు బెజ్జాలు తొలిచి, ఆకులు బిగించి, పూటీలు బిగగొట్టిన తరువాత, మరింక వాటిని ఊడదీయడం దేవుడితరం కూడా కాదన్నాడు.

“అసలు కష్టమంతా లక్కాకులు చేయడంలోనూ, వాటిని బిగించడంలోనూ ఉన్నాయండీ! లక్కాకు ఏ కాస్త తేడాగా వున్నా, ఇరుసు, ఏడాదికల్లా కోసుకుపోతుంది. బండిగాను పెడగా తిరుగుతుంది. లాగే ఎడ్లు కూడా గుంజలేక సచ్చిపోతాయండీ! పరంపెట్టి బిగించానంటే బాబుగారూ! నాలుగుపుట్ల బరువేసినా బండి సమమోయినుగా ఉంటుందేగానీ, బెసికిళ్ళాడదండీ! ఇలా ఇలా చెయ్యాలని, ఎక్కడా రాసి ఉండదు సార్! అంతా చూసి నేర్చుకోవాలి. అనుభవం మీదగానీ, ఈ కిటుకులన్నీ తెలియవండీ!” అన్నాడు బ్రహ్మానందం.

కత్తికాసుతో లైన్‌గీసుకొని, చేబాడిత్తో చివ్వి, అవతల పడేసేవాడేగానీ, ఏనాడూ నీటి మట్టం ఉపయోగించలేదన్నాడు బ్రహ్మానందం. మరి మంచాలకూ, మొగరాలకూ తప్ప తను చిత్రిక గుల్లను ఉపయోగించేవాడే కాదుట. ఉలితో బెజ్జం చేసినా, ఆగరతో బొక్క తొలచినా, పెద్ద తేడా ఉండేది కాదుట. ఎడం కన్ను మూసి, కుడి కంటితో అంచును చూస్తే మీరింక మూలమట్టం వేసి చూడాల్సిన అవసరమే ఉండేది కాదుట.

“ఏమయితేనేంగానీ, ఆ పనంతా ఇప్పుడెందుకూ పనికిరాకుండా పోయిందండీ. అక్కడా చాలా పోటీ ఉంది. రైతులేమో, గట్టి గింజ కొలవడం మానేశారు. ఈ కాలవలొచ్చాక అంతా వరిమీద పడ్డారండీ! ఆ వడ్లే పాతిక మానికలు కొలిచారనుకోండి, తాలూ తప్పా, నూక, తవుడూ పోగా పదిమానికల బియ్యం కూడా నాకు దక్కవు. ఇదివరకులాగా, గొడ్లను గోదను పొలాలలోకి రానివ్వడం లేదు. నేను పుట్టి బుద్దెరిగిన తరువాత, పాలూ, పెరుగూ, మజ్జిగా కొనుక్కోలేదండీ. ఇంటికి

చుట్టమొచ్చినా, పక్కమొచ్చినా, ఏ రైతు ఇంటికెళ్లినా, చింతగింజేస్తే మునగని చిక్కని మజ్జిగ దొరికేవి. వొడినిండా కూరగాయలేసి పంపేవాళ్ళు. ఇప్పుడవన్నీ పోయాయి. పాలన్నీ బస్తీలకు అమ్ముకుంటున్నారు. కూరలూ అంతే, పంటలూ అంతేనండీ!'' అన్నాడు బ్రహ్మానందం.

అందుకనే, అతను పల్లెటూరును విడిచిపెట్టి విజయవాడ వచ్చాడు. వచ్చాక రెండుమూడు నెలలపాటు ఇక్కడి వాతావరణానికి అలవాటు పడలేకపోయాట్ట. లోగడ తను వతనుగా కలపకొంటున్న సావుకారు దగ్గరే పనికి కుదిరాట్ట.

''ముందుగా రోజుకూలీకి పనిచేశానండీ! రోజుకు ఎనిమిది రూపాయలిచ్చేవాడు. చచ్చేపని తీసుకొనేవాడు, ఏ రోజుపనికి రాకపోతే, ఆ రోజు నాగాకింద లెక్క. మరింక ఆ పూటకు మాడిచావాల్సిందే! అందుకని ఆయన దగ్గరే కాంట్రాక్టుకుచేస్తున్నా, రోజుకు ఆడతా పాడతా చేసినా, రెండు డ్రాయర్లు చేస్తానండి! పది పన్నెండు ఠంగుమని చేతిలో పడతాయి. కుర్చీలు, స్టూలుబల్లలు, కిటికీలు, ద్వారబందాలు, తలుపులు రకరకాల మంచాలు, గడియారాలు పెట్టుకొనే బాక్సులు, బీరువాలు... ఫర్నిచర్ పనంతా చేస్తా...'' అన్నాడు బ్రహ్మానందం.

ఊళ్ళో అద్దె భరించలేక, కృష్ణలంకలో వో చిన్న పూరిల్లు అద్దెకు తీసుకుని తలదాచుకొంటున్న బ్రహ్మానందానికి నాలుగురు పిల్లలున్నారు.

వాళ్ళనయినా బాగా చదివించి 'ఉద్యోగం'లో చేర్చాలని బ్రహ్మానందం కలలు కంటున్నాడు.

''నా రెక్కలు తప్ప, నాకింకో దిక్కులేదు బాబు!'' అన్నాడతను మంచం పెట్టెకు అంచును మలుస్తూ. ''కలకాలం నమ్ముకున్న పల్లెటూరు నన్ను దగాచేసింది. గంపెడన్ని ఆశలు మోసుకుంటూ వచ్చినందుకు ఈ బెజవాడ కూడా నన్ను దగా చేసింది.'' ఈ ఆరేళ్ళలోనూ, మూడుసార్లు కొంపలు కాలి, అతను, అతనిసంసారమూ కట్టుగుడ్డలతో ఇవతలకు రావలసి వచ్చింది. వచ్చిన ప్రతిసారీ, మళ్ళీ 'అఆ'ల దగ్గరనుండీ బతుకును ప్రారంభించవలసి వచ్చింది.

ఈ సామాజిక వ్యవస్థలో అతని కలలు, నీరుగారిపోతాయే తప్ప, ఫలించవని అతనికెవరు చెబుతారు? ఎప్పుడు చెబుతారు?